క్లుప్తంగా

చెన్నకేశవ స్వామి ఆలయంలో పక్షపాత వైఖరి

మార్కాపురం టౌన్: మార్కాపురం పట్టణంలోని శ్రీలక్ష్మీ చెన్నకేశవ స్వామి దేవాలయంలో అధికారులు, అర్చకులు కలిసి పక్షపాత వైఖరి అవలంబిస్తున్నారని, వందల సంవత్సరాల నుంచి వస్తున్న ఆచార సంప్రదాయలను తుంగలో తొక్కారని మార్కాపురం పట్టణంలోని ముఖ్య అర్చకులు సోమయాజుల హరిప్రసాద్, ఆయన సోదరులు ఒక ప్రకటనలో ఆరోపించారు. ఏటా ఉగాది రోజున పంచాంగాన్ని సోమయాజుల వంశస్తులమైనన తాము ఆలయంలో చదువుతామని, అయితే ఈ ఉగాది రోజున తమకు ఆ అవకాశం ఇవ్వలేదని పేర్కొన్నారు. సంప్రదాయాన్ని మరిచి ఇతరులతో పంచాంగ పఠనం చేయించడాన్ని తప్పుబట్టారు. ఈ విషయమై తాము దేవదాయశాఖ కమిషనర్‌కు ఫిర్యాదు చేసి న్యాయం చేయాలని కోరనున్నట్లు తెలిపారు.

బ్రాహ్మణ సేవా సమాఖ్య రాష్ట్ర కార్యదర్శిగా పవన్‌కుమార్


పవన్‌కుమార్ శర్మ

మార్కాపురం: ఏపీ బ్రాహ్మణ సేవా సంఘ సమాఖ్య పురోహిత విభాగం రాష్ట్ర కార్యదర్శిగా మార్కాపురం పట్టణానికి చెందిన దేవులపల్లి పవన్‌కుమార్‌శర్మ నియమితులయ్యారు. ఈ మేరకు సమాఖ్య అధ్యక్షుడు కోనూరు సతీష్‌శర్మ ఉత్తర్వులు జారీ చేశారు. రాష్ట్రంలో పురోహితులు ఎదుర్కొంటున్న సమస్యలను గుర్తించి ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తానని పవన్‌కుమార్‌శర్మ తెలిపారు.

కర్నాటక శివ భక్తులకు అన్నసంతర్పణ


రైల్వే స్టేషన్ వద్ద భోజనం చేస్తున్న భక్తులు

మార్కాపురం టౌన్: ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకుని కర్నాటక రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలకు చెందిన శివ భక్తులు శ్రీశైలం మల్లికార్జున స్వామిని దర్శించుకున్నారు. తిరుగు ప్రయాణంలో కర్నాటక వెళ్లేందుకు మార్కాపురం రైల్వే స్టేషన్‌కు చేరుకున్న భక్తులకు ఆదివారం రాత్రి నుంచి పలువురు దాతలు అన్న సంతర్పణ చేశారు. రైల్వే స్టేషన్‌లో భోజన సదుపాయం లేకపోవడంతో ప్రయాణికుల ఆకలి తీర్చేందుకు ఏటా అన్న సంతర్పణ చేస్తున్నట్లు అన్నదాన కమిటీ సభ్యులు తెలిపారు.

వరిగడ్డి వామి దగ్ధం

కొమరోలు: మండలంలోని సర్విరెడ్డిపల్లె గ్రామంలో అగ్ని ప్రమాదం సంభవించి వరిగడ్డి వామి దగ్ధమైంది. గ్రామానికి చెందిన ఆంజనేయులు అనే రైతుకు చెందిన వరిగడ్డి వామికి గుర్తు తెలియని వ్యక్తులు నిప్పు పెట్టడంతో అగ్నికి ఆహుతైంది. 23 వేల రూపాయల ఆస్తి నష్టం సంభవించిందని బాధిత రైతు ఆవేదన వ్యక్తం చేశారు. సమాచారం అందుకున్న అగ్నిమాపకశాఖ అధికారులు హుటాహుటిన సంఘటనా స్థలానికి చేరుకుని మంటలు అదుపు చేశారు.

జార్జి ఫార్మసీ కళాశాలలో క్యాంపస్ ఇంటర్వ్యూలు


ఎంపికైన విద్యార్థులతో కళాశాల యాజమాన్యం

మార్కాపురం: డాక్టర్ శామ్యూల్ జార్జి ఫార్మసీ కళాశాలలో సోమవారం దివిస్ లేబొరేటరీస్ ఆధ్వర్యంలో నిర్వహించిన క్యాంపస్ ఇంటర్వ్యూలో 40 మంది విద్యార్థులు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ రాజా జయరాం, అకడమిక్ డైరెక్టర్ డాక్టర్ వై.సునీత తెలిపారు. దివీస్ కంపెనీ హెచ్‌ఆర్ హరికృష్ణ హాజరై విద్యార్థులకు రాత పరీక్ష, ఇంటర్వ్యూలు నిర్వహించారని చెప్పారు. ఉద్యోగాలకు ఎంపికైన వారిని కళాశాల సెక్రటరీ డాక్టర్ ఆదిమూలపు సతీష్ అభినందించారు. కార్యక్రమంలో కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్ డాక్టర్ అశోక్‌బాబు, సిబ్బంది పాల్గొన్నారు.

భక్తి శ్రద్ధలతో రంజాన్ వేడుకలు



మార్కాపురం : మతపెద్ద మొగల్ అజ్మతుల్లా బేగ్ బోధనలు వింటున్న ముస్లింలు


బేస్తవారిపేటలోని ఈద్గా వద్ద ప్రార్థనల్లో పాల్గొన్న ముస్లింలు

- తక్బీర్ పఠిస్తూ ఈద్గాల వద్దకు చేరుకున్న ముస్లింలు
- పరస్పర ఆలింగనాలతో రంజాన్ శుభాకాంక్షలు

రంజాన్ పర్వదినాన్ని సోమవారం మార్కాపురం, గిద్దలూరు నియోజకవర్గాల్లోని ముస్లింలు భక్తి శ్రద్ధలతో నిర్వహించుకున్నారు. నెల రోజులపాటు ఆచరించిన కఠిన ఉపవాస దీక్షను రంజాన్ రోజున విరమించి అల్లాహ్‌ను భక్తితో ప్రార్థించారు. సోమవారం ఉదయం కొత్త వస్త్రాలు ధరించి మసీద్‌లకు చేరుకుని ప్రార్థనలు చేశారు. తక్బీర్ పఠిస్తూ ఈద్గాల వద్దకు చేరుకుని సామూహిక నమాజ్‌లో పాల్గొన్నారు.

మార్కాపురం టౌన్:

మార్కాపురం పట్టణంలో రంజాన్ పర్వదినం సందర్భంగా భక్తి భావం వెల్లివిరిసింది. పట్టణంలోని కంభంరోడ్డు, పినాగులవరం రోడ్డు, తర్లుపాడు రోడ్డుతోపాటు వివిధ ప్రాంతాల్లో ఉన్న ఈద్గాల వద్దకు ముస్లింలు పెద్ద ఎత్తున తరలివెళ్లారు. జామియా మసీదులో మొగల్ అజ్మతుల్లా బేగ్ ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. అల్లా చూపిన మార్గంలో నడుచుకోవాలని, ఇతరులపై ప్రేమ, జాలి, దయా, దాన, క్షమా గుణం కలిగి ఉండాలని తెలిపారు. ప్రార్థనల్లో రాష్ట్ర మైనార్టీ కార్పొరేషన్ బోర్డు మాజీ చైర్మన్ మీర్జా షంషీర్ అలీబేగ్, మున్సిపల్ వైస్ చైర్మన్ షేక్ ఇస్మాయిల్, ముస్లిం మతపెద్దలు పాల్గొన్నారు. ఒక్కరికొకరు ఈద్ ముబారక్ చెప్పుకున్నారు. మండలంలోని వివిధ గ్రామాల్లో రంజాన్ సందడి నెలకొంది.

పొదిలి: స్థానిక ఈద్గా వద్ద ముస్లింలు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. రంజాన్ పర్వదినం, ఉపవాసం ప్రాధాన్యతను మత పెద్దలు వివరించారు. ప్రతి ఒక్కరూ శాంతియుత జీవనం అలవర్చుకోవాలని సూచించారు. దేశమంతా సుభిక్షంగా ఉండాలని, ప్రశాంతంగా జీవితాలు గడపాలని ఆకాంక్షించారు. ప్రార్థనల అనంతరం ముస్లింలు పరస్పరం రంజాన్ శుభాకాంక్షలు చెప్పుకొన్నారు. వైఎస్సార్ సీపీ నాయకులు గొలమారి చెన్నారెడ్డి, కల్లం వెంకట సుబ్బారెడ్డి, ఫొటోగ్రాఫర్స్ అండ్ వీడియో గ్రాఫర్స్ ఓల్డ్ యూనియన్ అధ్యక్షుడు శ్రీకాంత్ ఆధ్వర్యంలో శీతల పానీయాలు పంపిణీ చేశారు.

తర్లుపాడు: మండల కేంద్రమైన తర్లుపాడుతోపాటు తుమ్మలచెరువు, మీర్జపేట, పోతలపాడు తదితర గ్రామాల్లో రంజాన్ పర్వదినాన్ని ముస్లింలు భక్తి శ్రద్ధలతో నిర్వహించుకున్నారు. కుటుంబ సభ్యులతో కలిసి ఈద్గా వద్దకు చేరుకుని ప్రార్థనలు చేశారు. ఎదుటివారిపై ప్రేమ, దయ, కరుణ కలిగి ఉండాలని ఇమామ్‌లు సూచించారు. కులమతాలకు అతీతంగా ముస్లింలు స్నేహితులను రంజాన్ విందుకు ఆహ్వానించారు. రంజాన్ మాస ఉపవాస దీక్షలు ముగించుకుని ఈద్-ఉల్-ఫిత్ర్ వేడుక నిర్వహించుకున్న ముస్లింల ఇళ్లకు పలువురు ప్రజా ప్రతినిధులు వెళ్లి శుభాకాంక్షలు తెలిపారు.

కొమరోలు: మండల కేంద్రమైన కొమరోలుతోపాటు అల్లినగరం, రాజుపాలెం, తిమ్మారెడ్డిపల్లె, నల్లగుంట్ల, చింతలపల్లె గ్రామాల్లోని ఈద్గాల వద్ద ముస్లింలు ప్రార్థనలు చేశారు. కొమరోలులోని పెద్ద మసీదు, చిన్న మసీదులో నమాజ్ అనంతరం ముస్లింలు తక్బీర్ చదువుతూ ఈద్గా వద్దకు చేరుకున్నారు. మత పెద్దలు దైవ సందేశాన్ని వివరించారు. మహిళలు గృహాల్లో ప్రార్థనలు చేశారు.

బేస్తవారిపేట: మండల కేంద్రమైన బేస్తవారిపేటతోపాటు చింతలపాలెం, కొత్తపేట, వంగపాడు, గలిజేరుగుళ్ల, శింగరపల్లె, పూసలపాడు, చెన్నుపల్లె గ్రామాల్లోని ఈద్గాల వద్ద ముస్లింలు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ప్రేమ, కరుణ, జాలి, త్యాగం, సహనం, పరోపకారం లాంటి సుగుణాలను జనింపజేసే రంజాన్ మాసం పవిత్రమైనదని మత పెద్దలు పేర్కొన్నారు. నెల రోజులపాటు ఆచరించిన కఠిన ఉపవాస దీక్షను రంజాన్ సందర్భంగా విరమించి ప్రార్థనల అనంతరం విందు ఆరగించారు.

మండల కేంద్రమైన అర్ధవీడు, పాపినేనిపల్లె, దొనకొండలోని ఈద్గాల వద్ద రంజాన్ సందర్భంగా ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈద్గాల వద్ద మత పెద్దలు అల్లాహ్ బోధనల సారాంశాన్ని వివరించారు. హిందూ, ముస్లింలు రంజాన్ శుభాకాంక్షలు చెప్పుకొని మత సామరస్యాన్ని చాటారు.

కంభం: కంభం పట్టణంలోని ముస్లింలు ర్యాలీగా ఈద్గా మైదానానికి చేరుకున్నారు. ఈద్గాకు రాలేని వారి కోసం మసీదుల్లో ప్రత్యేక ప్రార్థనలకు ఏర్పాట్లు చేశారు. ఈద్గాలో ప్రభుత్వ హాజీ ఆరీఫ్ హజరత్ ఆధ్వర్యంలో ప్రార్థనలు నిర్వహించి దువా చేశారు. ముస్లింలంతా ఐక్యంగా ఉంటూ సమాజంలో ముందుకు సాగాలని సూచించారు. ప్రార్థనల అనంతరం ఒకరినొకరు ఆలింగనం చేసుకుని పండుగ శుభాకాంక్షలు తెలుపుకొన్నారు. ఈద్గా వద్ద కంభం ఎస్సై నరసింహారావు తన సిబ్బందితో కలిసి బందోబస్తు నిర్వహించారు. ముస్లింలకు రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. మండలంలోని అన్ని గ్రామాల్లో ఈద్గాలు, మసీదుల్లో ప్రార్థనలు నిర్వహించారు.

గిద్దలూరు రూరల్: రంజాన్ సందర్భంగా పట్టణంలోని కొంగలవీడు రోడ్డు, నంద్యాల రోడ్డులోని ఈద్గాలు, అలాగే మండలంలోని ముండ్లపాడు, అంబవరం, కేఎస్.పల్లె, కంచిపల్లె, ఉయ్యాలవాడ, కొమ్మునూరు తదితర గ్రామాల్లో సోమవారం ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. రంజాన్ మాసం విశిష్టత, ఖురాన్ గ్రంథంలోని అల్లాహ్ బోధనలను మత పెద్దలు వివరించారు. వైఎస్సార్ సీపీ గిద్దలూరు నగర పంచాయతీ కన్వీనర్, 13వ వార్డు కౌన్సిలర్ మానం బాలిరెడ్డి నల్లబండ బజారులో వైఎస్సార్ సీపీ నాయకుడు నూర్‌బాషా ఇచ్చిన రంజాన్ విందుకు హాజరయ్యారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు యర్రం వెంకట రామిరెడ్డి, పాలుగుళ్ల నరసింహారెడ్డి, పాలుగుళ్ల మహేష్‌రెడ్డి, మత్తయ్య, దిలీప్‌రెడ్డి, సునీల్‌రెడ్డి, పాలుగుళ్ల సుబ్బారెడ్డి, చేరెడ్డి శ్రీకాంత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రాచర్ల: ఈద్ ఉల్ ఫిత్ర్ వేడుకలను రాచర్ల మండలంలోని ముస్లింలు భక్తి శ్రద్ధలతో నిర్వహించుకున్నారు. అనుమలవీడు, ఆకవీడు, అరవీటికోట, రాచర్ల, యడవల్లి, గుడిమెట్ట, సంగపేట, పాకలవీడు, గౌతవరం, జేపి చెరువు, అచ్చంపేట, చోళ్లవీడు గ్రామాల్లో ముస్లింలు ఈద్గాల వద్దకు ర్యాలీగా వెళ్లి నమాజ్ చేశారు. ఈద్గాల వద్ద పేదలకు కానుకలు అందజేశారు. అనుమలవీడులో ఈద్గా వద్ద మక్కా మసీదు హాఫీజ్ సయ్యద్ ఖాదర్‌బాషా అల్లాహ్ సందేశాన్ని వినిపించారు. మహమ్మద్ ప్రవక్త చూపిన మార్గంలో నడవాలని, ఐదు పూటలా నమాజ్ చేసేయడంతోపాటు ఖురాన్ పఠించాలని సూచించారు. మద్యం సేవించడం ఇస్లాం ధర్మానికి విరుద్ధమని చెప్పారు. పేదలకు దానం చేసే గుణాన్ని అలవర్చుకోవాలని తెలిపారు. ప్రార్థనల అనంతరం ఈద్గా వద్ద ముస్లింలు ఒకరికొకరు శుభాకాంక్షలు తెలుపుకొన్నారు.


గిద్దలూరులో ఇఫ్తార్ విందుకు హాజరైన వైఎస్సార్ సీపీ నాయకులు


రాచర్లలో ఖురాన్ సందేశాన్ని బోధిస్తున్న హాఫీజ్ సయ్యద్ ఖాదర్‌బాషా


తర్లుపాడు : ఈద్గా వద్దకు వెళ్తున్న ముస్లింలు


కంభంలో అల్లాహ్ సందేశాన్ని వివరిస్తున్న హాజీ ఆరీఫ్


కొమరోలులో ఈద్గా వద్ద ప్రార్థనలో పాల్గొన్న ముస్లింలు


కంభం : ఈద్గా మైదానంలో ముస్లింల దువా..


పొదిలిలో నమాజ్‌లో పాల్గొన్న ముస్లింలు

ఎంపీ వైవీ సుబ్బారెడ్డి మాతృమూర్తికి ఘన నివాళి


వైవీ సుబ్బారెడ్డి మాతృమూర్తి పిచ్చమ్మ చిత్ర పటానికి నివాళులర్పిస్తున్న అన్నా రాంబాబు

వైఎస్సార్ సీపీ నేత, రాజ్యసభ సభ్యుడు వైవీ సుబ్బారెడ్డి మాతృమూర్తి యర్రం పిచ్చమ్మ ఉత్తరక్రియలు సోమవారం ఒంగోలులోని వైవీ నివాసంలో నిర్వహించారు. ఈ సందర్భంగా వైఎస్సార్ సీపీ మార్కాపురం నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే అన్నా రాంబాబు, మాజీ ఎమ్మెల్యే జంకె వెంకటరెడ్డి హాజరై పిచ్చమ్మ చిత్రపటానికి ఘనంగా నివాళులర్పించారు.


వైవీ సుబ్బారెడ్డిని పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే జంకె వెంకటరెడ్డి

మాజీ ఎమ్మెల్యే కేపీతో కొనకనమిట్ల నేతల భేటీ


కేపీ నాగార్జునరెడ్డితో మండల నాయకులు

కొనకనమిట్ల: మాజీ ఎమ్మెల్యే, గిద్దలూరు నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి కేపీ నాగార్జునరెడ్డిని సోమవారం కొనకనమిట్ల మండల వైఎస్సార్ సీపీ నాయకులు పలువురు మర్యాదపూర్వకంగా కలిశారు. వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకులు, మాజీ ఎమ్మెల్యే ఉడుముల శ్రీనివాసులరెడ్డి ఇంటికి వచ్చిన కేపీని ఎంపీపీ మోరబోయిన మురళీకృష్ణయాదవ్, జెడ్పీటీసీ అక్కిదాసరి ఏడుకొండలు, మండల పార్టీ కన్వీనర్ మోరా శంకర్‌రెడ్డి, మాజీ సొసైటీ చైర్మన్ కామసాని వెంకటేశ్వరరెడ్డి, నియోజకవర్గ విద్యార్థి విభాగం కన్వీనర్ ఏలూరి సంజీవరెడ్డి, నాయకులు చెన్నారెడ్డి, సూరవరపు పెదవెంకటరెడ్డి, ఎంఆర్‌ఎఫ్ వెంకటేశ్వరరెడ్డి, సీసీకెఆర్ శ్రీనివాసులరెడ్డి కలిసి పార్టీ కార్యక్రమాలపై చర్చించారు.

పాస్టర్ మృతిపై నిజాలు బయటపెట్టాలి


పొదిలి పెద్ద బస్టాండ్‌లో నిరసన తెలుపుతున్న విశ్వాసులు

పొదిలి: పాస్టర్ ప్రవీణ్ పగడాల మృతికి కారణమైన వారిని కఠినంగా శిక్షించాలని కోరుతూ పాస్టర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో క్రైస్తవ విశ్వాసులు ఆదివారం రాత్రి పొదిలిలో శాంతియుత ప్రదర్శన నిర్వహించారు. ప్రవీణ్ మృతిపై పలు అనుమానాలు ఉన్నాయని, విచారణ చేపట్టి నిజాలు నిగ్గుతేల్చాల్సిన బాధ్యత ప్రభుత్వానిదే అని పలువురు పాస్టర్లు పేర్కొన్నారు. స్థానిక పెద్ద బస్టాండ్‌లో మోకాళ్లపై నడుస్తూ ప్రవీణ్ ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు. అనంతరం పోలీసులకు వినతిపత్రం అందజేశారు.

వైభవంగా మకర తోరణ గ్రామోత్సవం

కొనకనమిట్ల: పట్టాభిరామస్వామి మకర తోరణ ఉత్సవం కొనకనమిట్ల మండలంలోని గొట్లగట్టు గ్రామంలో వైభవంగా నిర్వహించారు. పట్టాభిరామస్వామి మూలవిరాట్ మకర తోరణాన్ని పేర్ల వెంకటసుబ్బయ్య కుమారులు సుమారు రూ.70 వేలు వెచ్చించి తయారు చేయించారు. గ్రామస్తుల సహకారంతో ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో ఊరేగింపు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్యవైశ్య మహిళలు కోలాటం ప్రదర్శించారు. భక్తుల జైశ్రీరామ్ నినాదాలతో గ్రామ వీధులు మారుమోగాయి.


మకర తోరణాన్ని ఊరేగిస్తున్న దృశ్యం

వక్ఫ్ బోర్డు బిల్లు ఉపసంహరించుకోవాలి


మార్కాపురంలో నిరసనలో పాల్గొన్న ముస్లింలు


గిద్దలూరులో నిరసన తెలియజేస్తున్న ముస్లింలు

- నల్ల బ్యాడ్జీలతో ముస్లింల నిరసన

మార్కాపురం: వక్ఫ్ బోర్డు సవరణ బిల్లులపై కేంద్ర ప్రభుత్వం తన నిర్ణయాన్ని మార్చుకోవాలని మార్కాపురం పట్టణంలోని ముస్లింలు డిమాండ్ చేశారు. సోమవారం రంజాన్ సందర్భంగా ఈద్గా వద్దకు వెళ్లే సమయంలో నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ముస్లిం నాయకులు మాట్లాడుతూ.. వక్ఫ్ బోర్డు సవరణ బిల్లు రాజ్యాంగ వ్యతిరేకమన్నారు. వక్ఫ్ సవరణ బిల్లును రాష్ట్ర ప్రభుత్వంతోపాటు అన్ని పార్టీలు వ్యతిరేకించాలని పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. బీజేపీ కుట్రలను ఎదుర్కోవడానికి ముస్లిం సమాజం ఏకం కావాలని పిలుపునిచ్చారు. ప్రజాస్వామ్యంలో మొదటిసారిగా ప్రతిపక్షాల అభ్యంతరాలను పరిగణలోకి తీసుకోకుండా మొండిగా ఈ బిల్లును తీసుకురావాలని కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ప్రయత్నిస్తోందని విమర్శించారు. కార్యక్రమంలో వివిధ మసీదుల ముత్తవల్లిలు, ముస్లిం మత పెద్దలు పాల్గొన్నారు.

రాచర్ల/గిద్దలూరు రూరల్: కేంద్ర ప్రభుత్వం వక్ఫ్‌బోర్డు బిల్లును ఉపసంహరించుకోవాలని అనుమలవీడు గ్రామంలోని జామీయ మసీదు, మక్కా మసీదుల్లోని ముస్లింలు డిమాండ్‌చేశారు. ఈ సందర్భంగా మాజీ మండల కోఆప్షన్ సభ్యుడు షేక్. పల్నాటి మహబుబ్‌పీరా మట్లాడుతూ.. వక్ఫ్‌బోర్డు బిల్లు స్వతంత్రతను కుదించే విధంగా ఉందని, ముస్లింలకు చెందిన ఆస్తుల పరిరక్షణకు భంగం కలిగించేలా ప్రభుత్వం వ్యవహరిస్తోందని విమర్శించారు. వక్ఫ్‌బోర్డు బిల్లుపై ప్రభుత్వ అధికారం తగ్గించాలని, ముస్లిం సమాజానికి అనుకూలంగా సవరణ చేయాలని, ముస్లీం ఆస్తులను దుర్వినియోగం చేయకుండా కాపాడాలన్నారు. వక్ఫ్ బోర్డు బిల్లును ఉపసంహరించుకోని పక్షంలో హక్కుల ఉద్యమాన్ని మరింత తీవ్రతరం చేస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో జామీయ మసీదు, మక్కా మసీదు హాఫీజ్‌లు సయ్యద్ మహమ్మద్, సయ్యద్ అబ్దుల్ ఖాదర్, ముతవల్లిలు కొర్విపాటి మౌలాపీరా, బురుజుల గఫూర్, మతపెద్దలు షేక్ మొహిద్దీన్ తదితరులు పాల్గొన్నారు. కేంద్ర ప్రభుత్వం వక్ఫ్‌బోర్డు సవరణ బిల్లుతో ముస్లింల హక్కులను కాలరాస్తోందని గిద్దలూరు పట్టణంలో నిరసన ప్రదర్శన నిర్వహించారు. కేంద్రం తీరును నిరసిస్తూ ముస్లింలు నల్లబ్యాడ్జీలు ధరించి నమాజ్‌లో పాల్గొన్నారు.